మౌలానా సేవలు అజరామరం

– డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా

కడప ఎడ్యుకేషన్: మౌలానా అబుల్ కలాం ఆజాద్ మొదటి కేంద్ర విద్యాశాఖ మంత్రిగా విద్యలో తీసుకొచ్చిన మార్పులు, సేవలు అజరామరం అని డిప్యూటీ సీఎం అంజాద్‌బాష అన్నారు. కడప నగర శివార్లలోని మౌలానా అబుల్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం మౌలానా అబుల్ కలాం జయంతి వారోత్సవాల్లో భాగంగా నగరంలోని పలు ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఇందులో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు డిప్యూటీ సీఎం అంజాద్‌బాష చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అంజద్‌బాషా మాట్లాడుతూ మొదటి విద్యాశాఖ మంత్రిగా ఆయన అందించిన సేవలను ఎవరూ మరిచిపోకూడదన్నారు. ప్రతి పాఠశాలలో, కళాశాలల్లో ఆయన గురించి అందరూ తెలుసుకోవాలన్నారు. మను పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ ముఖ్సిత్‌ఖాన్, అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థినికి బహుమతిని ప్రదానం చేస్తున్న డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా

రైతుల అభివృద్ధికి డీలర్లు కృషి చేయాలి

– రాష్ట్ర ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి

కడప అగ్రికల్చర్: రైతుల పంటల సాగులో డీలర్లు కూడా తమ వంతు సహకారం అందించి వారికి కావాల్సిన నాణ్యమైన విత్తనాలతోపాటు ఎరువులను అందించి వారి అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం కడప నగర శివార్లలోని ఊటుకూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో వ్యవసాయ ఇన్‌పుట్ డీలర్లు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ డీలర్లు రైతులకు స్థానిక స్థితిగతులకు తగ్గట్టుగా ఎరువులను, పురుగు మందులను అందించాలన్నారు. ఊటుకూరు వ్యవసాయ పరిశోధనస్థానం అధిపతి డాక్టర్ శ్రీనివాసాచారి మాట్లాడుతూ డీలర్లంతా ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలోని డీలర్లే రైతులకు శాస్త్రవేత్తలతో సమానం అన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, ఆత్మ పీడీ విజయలక్ష్మి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు జాన్సన్, సునీల్‌కుమార్, శ్రీవల్లి, శిల్పకళ, రామలక్ష్మిలతోపాటు డీలర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి

నగరంలో బంద్ ప్రశాంతం

వైవీయూ/ఏఎఫ్‌యూ : విద్యార్థి, యువజన సంఘాల పిలుపు మేరకు కడపలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలంటూ నిర్వహించిన విద్యాసంస్థల బంద్ యోగివేమన విశ్వవిద్యాలయం, వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయాల్లో ప్రశాంతంగా సాగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ విశ్వవిద్యాలయాల రాష్ట్ర కో కన్వీనర్ ఎం.ఆర్. నాయక్ మాట్లాడుతూ కడప ఉక్కు నిర్మాణం చేపట్టాలని దశాబ్దం పైగా ఉద్యమాలు జరుగుతున్నా, ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. కేవలం శంకుస్థాపనలకే పరిమితమవుతున్నారని విమర్శించారు. పరిశ్రమలు లేకపోవడంతో యువత మహానగరాలకు వలస వెళ్లాల్సి వస్తోందన్నారు. కడపలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం చేపడితే వేలాదిమంది యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. ఆంధ్రుల హక్కుగా పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్ పరం చేయవద్దని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మనోజ్, రాకేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటు పరం కానివ్వం

కడప ఎడ్యుకేషన్: కడప ఉక్కు పరిశ్రమను వెంటనే ప్రారంభించాలని, దీంతోపాటు విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీ కరణ ఆపాలని రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న బంద్‌లో భాగంగా బుధవారం కడప నగరంలో నిర్వహించిన విద్యార్థి సంఘాల బంద్ కార్యక్రమం ప్రశాంతంగా సాగింది. ఈ సందర్భంగా విద్యార్థి సంఘ నాయకులు నగరంలోని పలు పాఠశాలలను మూయించి బంద్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌బి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్ మాట్లాడుతూ అధిక సంఖ్యలో ఉద్యోగాలు ఇస్తామని గొప్పలు చెప్పి అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ ప్రభుత్వం ఉద్యోగాల కల్పనలో విఫలం అయిందన్నారు. పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, ఆర్ఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నకేశవరెడ్డి, ఏఐవైఎఫ్ రాయలసీమ ఇన్‌చార్జి ఓబయ్యలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పలు విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.


వైవీయూ: వైఎస్ఆర్ ఏఎఫ్‌యూలో బంద్ నిర్వహిస్తున్న విద్యార్థి సంఘ నాయకులు


కడప ఎడ్యుకేషన్: చెమ్మియాపేట పాఠశాలలో బంద్‌ను నిర్వహిస్తున్న ఏఐఎస్‌బి నాయకులు

మంచినీటి వనరులను సంరక్షించుకోవాలి

కడప కార్పొరేషన్: మంచి నీటి వనరులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఏఈ మణిగోపాల్‌రెడ్డి, మెప్మా సీఎంఎం హరిప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం మెప్మా, నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జల్ దివాళి కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా స్వయం సహాయ సంఘాల నుంచి ఎంపిక చేసిన అమృత్ మిత్రలకు స్థానిక లింగంపల్లి వాటర్ వర్క్స్ వద్ద మంచినీటి వనరుల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. నీటిని వృధాగా వదలడం, రీ సైక్లింగ్ చేయకపోవడం వంటి కారణాల వల్ల నీటి నిల్వలు, భూగర్భ జలాలు అడుగంటిపోతాయన్నారు. మహిళలంతా నీటి సంరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. నీటి వనరులు లేకపోతే భవిష్యత్ తరాలకు తీవ్ర నష్టం చేకూరుతుందని హెచ్చరించారు. నీటిని కాపాడుకోకపోతే జరిగే అనర్థాలను తోటి ఎస్‌హెచ్‌జీ సభ్యులకు వివరించాలన్నారు. అనంతరం నీటి సంరక్షణను తెలియజేసేలా గ్లాసు, వాటర్ బాటిళ్లతో కూడిన కిట్లను అమృత్ మిత్రలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అమృత్ ఏఈలు స్వరూప, దిల్షాద్, సీవోలు పాల్గొన్నారు.


నీటి సంరక్షణపై మహిళలకు వివరిస్తున్న సీఎంఎం హరిప్రసాద్‌రెడ్డి తదితరులు

ఘనంగా రేడియాలజీ దినోత్సవం

కడప అర్బన్: ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో బుధవారం అంతర్జాతీయ రేడియాలజీ డేను ఘనంగా నిర్వహించారు. రాంట్జన్ ఫోటోకు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ, సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవిలు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎక్స్‌రే బ్లాక్‌కు «రాంట్జన్ బ్లాక్»గా నామకరణం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సురేఖ మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరం నుంచే ఐదు రేడియాలజీ పీజీ సీట్లు మంజూరయ్యాయన్నారు. ప్రజలకు రేడియాలజీ సేవలను మరింత సమర్థవంతంగా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. సురేశ్వర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ శ్రీనివాసనాయక్, ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు, రేడియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ డేవిడ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కడప రిమ్స్ ప్రిన్సిపాల్ సురేఖ

ఓటరు జాబితా పక్కాగా ఉండేలా చర్యలు

కడప కోటిరెడ్డి సర్కిల్ : ఓటరు జాబితా తయారీలో చోటుచేసుకున్న పలు అంశాలపై సమీక్షించి జాబితా పక్కాగా ఉండేలా తగిన చర్యలు తీసుకుంటున్నామని కడప ఆర్డీఓ మధుసూదన్ తెలిపారు. బుధవారం కడపలోని తన కార్యాలయంలో ఆర్డీఓ పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు నమోదు ప్రత్యేక శిబిరాల ద్వారా జాబితాలో మార్పులు, చేర్పులకు సంబంధించి దరఖాస్తులను స్వీకరించామన్నారు. రాజకీయ పార్టీలు ఓటరు జాబితాలోని అభ్యంతరాలు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అందరి సహకారంతో ఎలాంటి లోటు పాట్లు లేని ఓటర్ల జాబితా తయారీకి తగిన చర్యలు చేపడుతున్నామన్నారు. ఇదే క్రమంలో పలు పార్టీల ప్రతినిధులు వివిధ అంశాలను ఆర్డీఓ దృష్టికి తీసుకు వచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరామిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శివారెడ్డితోపాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ మధుసూదన్

మినుము పంట పరిశీలన

వల్లూరు : మండలంలోని గోటూరులో రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన మినుము పంటను మండల వ్యవసాయ శాఖ అధికారి సాయిజ్యోతి బుధవారం పరిశీలించి మాట్లాడారు. సెప్టెంబర్ చివరి వారంలో కురిసిన వర్షాలకు పలువురు రైతులు వివిధ గ్రామాల్లో మొత్తం 2456 ఎకరాల్లో మినుము పంటను సాగు చేయగా ఇందులో 664 ఎకరాల్లో నీటి పారుదల కింద, 1882 ఎకరాల్లో వర్షాధారం కింద పంటను సాగు చేశారన్నారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్న ప్రస్తుత నేపథ్యంలో బెట్టను తట్టుకోవడానికి గానూ పురుగు మందులతోపాటు నెలలోపు పంటకు 19-19-19 లీటరు నీటికి 5 గ్రాముల చొప్పున, నెల పైన పంటకు 13-0-45 లీటరు నీటికి 5 గ్రాముల చొప్పున కలిపి పిచికారి చేయాలని సూచించారు. దీని వలన మొక్కకు త్వరగా పోషకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి మౌనిక, రైతులు పాల్గొన్నారు.

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా

– ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : కమలాపురం పట్టణం రూపురేఖలను మార్చి రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం మార్కెట్ యార్డు ప్రాంగణంలో రూ.1.20 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, ఇండస్ట్రియల్, అగ్రికల్చర్, హార్టికల్చర్ అడ్వైజర్లు రాజోలి వీరారెడ్డి, తిరుపాల్‌రెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డితో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 40 ఏళ్ల క్రితం కమలాపురం ఎలా ఉందో నాలుగేళ్ల క్రితం వరకు అలాగే ఉండేదన్నారు. కమలాపురంను అన్ని విధాలా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతోనే ముందుగా మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేశానన్నారు. ఇప్పుడు రూ.58 కోట్లతో పట్టణం అంతా మంచి నీటి పైప్‌లైన్ వేస్తున్నామని, అలాగే రోడ్డు విస్తరణ, సుందరీకరణ పనులు చేస్తున్నామన్నారు. ఇప్పటికే పాలిటెక్నిక్, ఆసుపత్రి భవనాలను ప్రారంభించామన్నారు. ఆర్‌ఓబీ, బైపాస్, బీసీ వేల్ఫేర్ హాస్టల్, మునిసిపల్ బిల్డింగ్ తదితర నిర్మాణాలన్నీ పూర్తి చేసి కమలాపురంను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామన్నారు. మార్కెట్ యార్డులో ఏడాది క్రితం ఒక షాపింగ్ కాంప్లెక్స్, ఇప్పుడు మరో షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభించామన్నారు. అలాగే రైతులకు పశువుల సంత ఏర్పాటు చేశామన్నారు. శీతల గిడ్డంగి, ప్రహరీ, రైతులకు అవసరమైన ప్లాట్ ఫామ్ తదితరవి నిర్మిస్తున్నామన్నారు. ఈ నిర్మాణాలన్ని పూర్తి అయితే కమలాపురం రూపు రేఖలే మారిపోతాయన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీడీఎం శ్రీకాంత్‌రెడ్డి, ఏడీఎం ఆజాద్‌వల్లి, ఈఈ వెంకటేశ్వరరావు, డీఈ సంపత్‌కుమార్, ఏడీఏ నరసింహారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ పుల్లారెడ్డి, వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, కాంట్రాక్టర్ శేఖర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, సీఎస్ నారాయణ రెడ్డి, చెన్నకేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు

పెండ్లిమర్రి : గ్రామీణ ప్రాంతాల్లో విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువస్తున్నారని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ ఏ.మల్లికార్జునరెడ్డిలు తెలిపారు. మండలంలోని రంపతాడు గ్రామ సచివాలయం పరిధిలోని మమ్ముసిద్దుపల్లెలో నూతనంగా నిర్మించిన వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలను బుధవారం వారు ప్రారంరభించి మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, సీకేదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రమణారెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, సర్పంచ్ సంజీవ్ పాల్గొన్నారు.

ఇతర రాష్ట్రాల మద్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎస్ఈబీ అధికారులు, సిబ్బంది

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడప స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలోని అక్కయ్యపల్లెలో దాడులు నిర్వహించి రామమోహన్ అనే వ్యక్తి నుంచి ఇతర రాష్ట్రాలకు సంబంధించిన 133 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచారు. ఈ దాడుల్లో ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్లు విశ్వనాథ్‌రెడ్డి, విజయ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

హామీల అమలులో కేంద్రం విఫలం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఎన్నికల వాగ్దానాలకు తిలోదకాలిచ్చి ప్రజలపై పన్నుల భారాన్ని మోపుతూ, ప్రకృతి వనరులను దోపిడీ చేస్తూ సంపన్న వర్గాలకు కట్టబెట్టి ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న కేంద్ర ప్రభుత్వంపై సమరశీల పోరాటాలకు సమాయత్తం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఓబులేసు పిలుపునిచ్చారు. బుధవారం సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ఎన్నికల ముందు నల్లధనం వెలికితీత, ఉద్యోగ ఉపాధి కల్పన, ప్రభుత్వ రంగ సంస్థల పటిష్టత, రైతుల ఆదాయం రెట్టింపు, దేశ సమైక్యత సమగ్రత వంటి వాగ్దానాలను ఇచ్చిందని, వాటిని అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు బి రామయ్య, ఎల్ నాగ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్యాబ్‌ల పంపిణీ


ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న అంబవరం ప్రభాకర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వం డిజిటల్ విద్యకు పెద్దపీట వేస్తోందని సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణకిషోర్ పేర్కొన్నారు. బుధవారం కడప మున్సిపల్ మైదానంలో దివ్యాంగ విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రస్తుత కాలంలో సాంకేతిక విద్య ప్రాధాన్యత విస్తృతమైన నేపథ్యంలో విభిన్న ప్రతిభావంతులకు సాంకేతిక విద్యను అందించడం ద్వారా వారి జీవితాల్లో వెలుగులు నింపే అవకాశం కలుగుతుందన్నారు. ఇందుకు ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రుల సహకారం అవసరం అన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేటర్స్, రీసోర్సు పర్సన్స్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రానున్న ఎన్నికల్లో అటు కేంద్రం, ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఉందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు తాంతియాకుమారి తెలిపారు. నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థల ఆస్తులను మోదీ ప్రభుత్వం అమ్మకానికి పెట్టిందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే పరిస్థితులు చక్కబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్యామలమ్మ, నగర అధ్యక్షురాలు లావణ్య, పార్టీ జిల్లా అధ్యక్షులు గుండ్లకుంట శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'పప్పూరు' జయంతి

కడప కల్చరల్ : ప్రముఖ సాహితీవేత్త, స్వాతంత్ర్య సమరయోధులు పప్పూరు రామాచార్యులు 128వ జయంతిని బుధవారం కడప నగరంలోని బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. వైవీయూ పాలక మండలిసభ్యులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్వాతంత్ర్యోద్యమం, గ్రంథాలయోద్యమంతో పాటు పత్రికారంగంలో విశేష కృషి చేసిన ప్రతిభాశాలి పప్పూరు రామాచార్యులన్నారు. బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ పప్పూరు రచనలను వివరించారు. అనంతరం రచయిత కొత్తపల్లె రామాంజనేయులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

టీకాలతో వ్యాధుల నివారణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : క్రమం తప్పకుండా టీకాలు వేయించుకుంటే అనేక వ్యాధులకు అడ్డుకట్ట వేయవచ్చని వైద్య సిబ్బంది పేర్కొన్నారు. బుధవారం మారుతినగర్-4 సచివాలయానికి చెందిన సియోనుపురం అంగన్వాడీ కేంద్రంలో వైద్య సిబ్బంది సమావేశం నిర్వహించారు. కేంద్రానికి వచ్చిన వారితో మాట్లాడి వ్యాధి నిరోధక టీకాల కార్డు, కౌంటర్‌ఫైలు మెయింటెన్స్ తదితర వాటిపై ఆరా తీశారు. ప్రతి ఒక్క గర్భవతి, చిన్నపిల్లలు సకాలంలో టీకాలు వేయించుకునేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణా వైద్యులు, హోమియోపతి వైద్యులతోపాటు అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్నలత, సూపర్‌వైజర్ గుల్జార్‌బేగం, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలని వినతి

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న నాయీ బ్రాహ్మణులకు నగర పరిసర ప్రాంతాల్లో ఎకరా స్థలం కేటాయించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు చెన్నప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎగువగడ్డ రంగయ్య, ఉపాధ్యక్షులు వెంకటరత్నం, కోటపాటి రమణలు బుధవారం జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ నాయీబ్రాహ్మణులు తమ కుల వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. జిల్లా వాయిద్య సంఘం ఆధ్వర్యంలో కడప జిల్లాకు సంబంధించి వాయిద్య కళాశాలను ఏర్పాటు చేస్తూ కడప పరిసరాలలో ఒక ఎకరం స్థలం కేటాయించాలని జాయింట్ కలెక్టర్‌ను కోరామన్నారు. కార్యక్రమంలో వాయిద్య కళాకారుల ప్రధాన కార్యదర్శి రంగయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ రిటైర్డ్ కార్మికులను ఆదుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో 2014 నవంబరు 1వ తేదీకి ముందు ఉద్యోగ విరమణ చేసిన కార్మికులకు జీవన భృతి కింద రూ. 8000 అందించి ఆదుకోవాలని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాజేంద్రప్రసాద్, రఘునాథరెడ్డిలు కోరారు. ఈ మేరకు బుధవారం కడప నగర మేయర్ సురేష్‌బాబును కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిటైర్డ్ కార్మికులకు లగ్జరీ సర్వీసుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు.

నేడు ఎమ్మెల్యే రాక

వీరపునాయునిపల్లె : వీరపునాయునిపల్లె మండలంలోని ఎస్.పాలగిరి సచివాలయంలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ఆంధ్రకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నారని సర్పంచులు, ఎంపీటీసీలు, మండలస్థాయి అధికారులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

హుస్సేన్ వలి ఆరాధన

దువ్వూరు : దువ్వూరు మండలంలోని మీర్జఖాన్‌పల్లెలో ఉన్న హుస్సేన్‌వలి స్వామి దర్గాలో బుధవారం స్వామి ఆరాధన కార్యక్రమం దర్గా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దర్గా కమిటీ ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి పాల్గొని దర్గాలో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వీరారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

చదరంగం సాధనతో ఏకాగ్రత


చదరంగం జిల్లా బాలికల జట్టుతో నిర్వాహకులు, ఉపాధ్యాయులు

కడప స్పోర్ట్స్ : మేధో క్రీడ చదరంగం అని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి బి. అరుణకుమారి అన్నారు. బుధవారం కడప నగరంలోని నగరపాలక ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి అండర్-14, అండర్-17 బాలబాలికలకు చదరంగం ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదరంగం క్రీడను సాధన చేయడం ద్వారా విద్యార్థుల్లో ఏకాగ్రత అలవడుతుందన్నారు. చదరంగం క్రీడకు పెద్దసంఖ్యలో క్రీడాకారులు హాజరుకావడం ఈ క్రీడకు ఉన్న ఆదరణ అర్థమవుతోందన్నారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని సూచించారు. అనంతరం ఎంపికలను ప్రారంభించారు.
ప్రతిభచాటిన వారిని రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అండర్-14, అండర్-17 బాలబాలికల జిల్లా జట్లకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు నిత్యప్రభాకర్, ఉమేష్, శ్రీకాంత్, నాగప్రకాష్, చదరంగం ఎంపికల ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉమేష్, వ్యాయామ ఉపాధ్యాయులు సాజిత్, సునీల్, ప్రసాద్‌రెడ్డి, పద్మావతి, వెంకటసుబ్బమ్మ, వెంకటలక్ష్మి, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

ప్రొద్దుటూరు క్రైం : ఎస్ఆర్‌కే కంపెనీ చైర్మన్, వ్యవస్థాపకుడు ఎస్ రవికుమార్‌రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా కడపలోని పలు చోట్ల బుధవారం అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. రవికుమార్‌రెడ్డి కుమారుడు లలిత్ సంజీవరెడ్డి, కుటుంబ సభ్యులు, కంపెనీ ప్రతినిధి ఎం వినీత్‌రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో కడపలోని జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద గల అనాథ శరణాలయం, మా అమ్మఒడి పిల్లలకు, రెవెన్యూ సేవా సంస్థల్లో భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, సన్నిహితులు, ఎస్ఆర్‌కే కంపెనీ ఉద్యోగులు, సిబ్బంది, పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న దృశ్యం

దరఖాస్తుల ఆహ్వానం

కమలాపురం : మండలంలోని 5 వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ జ్యోతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోగటం 1, ఎర్రగుడిపాడు 1, సి.గోపులాపురం 1, ఎల్లారెడ్డిపల్లె 2 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అభ్యర్థులు 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు వాటిని ఎంపీడీఓ కార్యాలయంలో అందజేసి 14వ తేదీ జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు.

ఈ క్రాప్ బుకింగ్ తప్పనిసరి



దేవరాజుపల్లెలో రైతులకు ఈ-క్రాప్ బుకింగ్ రశీదులు అందిస్తున్న ఏడీఏ నరసింహారెడ్డి

కమలాపురం : రైతులు సాగు చేసిన తమ పంటలకు సంబంధించిన వివరాలను ఈ-క్రాప్ బుకింగ్ ద్వారా నమోదు చేస్తేనే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని దేవరాజుపల్లె, ఎల్లారెడ్డిపల్లె, గంగవరం, చిన్నచెప్పలి ఆర్‌బీకేలలో రైతులకు వారు ఈ-క్రాప్ బుకింగ్ రశీదులు అందజేశారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసా, ఇన్సూరెన్స్, మద్దతు ధర, పంట నష్టం తదితరవి అందాలంటే రైతులు పంటలు సాగు చేసిన తర్వాత ఈ-క్రాప్ బుకింగ్ తప్పని సరిగా చేయించాలన్నారు. 2023 ఖరీఫ్ సీజన్‌లో ఈ-క్రాప్ బుకింగ్ చేసిన రైతులందరికీ రశీదులు ఇస్తున్నామని, ప్రతి రైతు ఆర్‌బీకేలకు వెళ్లి ఈ రశీదులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ సరస్వతి, ఏఈఓ దస్తగిరి, వీఏఏలు రైతులు పాల్గొన్నారు.

ఇంటింటికీ నేచురల్ గ్యాస్

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని ఇంటింటికి నేచురల్ గ్యాస్ అందించేందుకు తగిన చర్యలు చేపడుతున్నామని ఏజీఅండ్‌పీ సంస్థ మేనేజర్ విజయ్‌మోహన్ తెలిపారు. నేచురల్ గ్యాస్‌ను ఇప్పటికే అక్కే నగర్, ఏపీహెచ్‌బీ కాలనీ, ప్రకాశ్‌నగర్, ఎర్రముక్కపల్లె తదితర ప్రాంతాలలో సుమారు 4 వేల గృహాలకు నిరంతరంగా సురక్షితంగా అందిస్తున్నామన్నారు. వచ్చే ఏడాది మార్చి చివరిలోగా మరో పది వేల గృహాలకు నేచురల్ గ్యాస్ అందుబాటులోకి తీసుకు రావడానికి పైపులైన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. నగరంలో తమ గ్యాస్ పైప్‌లైన్ గుర్తించేందుకు ప్రతి 100 మీటర్లకు రూట్ మ్యాప్ ఏర్పాటు చేశామన్నారు. తమ పైపులైన్ ఉన్నచోట్ల వివిధ కారణాలతో తవ్వకాలు జరపాలంటే ముందుగా తమ కాల్ సెంటర్ 1800 2021 999కు కాల్ చేసి తగిన సూచనలు పాటించాల్సి ఉంటుందన్నారు. ప్రజలకు గ్యాస్ సరఫరాలో ఆటంకం లేకుండా తమవంతుగా తోడ్పాటు అందించాలన్నారు.

జాతీయ పోటీలకు షారోన్



కడప కల్చరల్ : కడప నగరం మారుతినగర్‌లోని నాగార్జున మోడల్ స్కూల్ విద్యార్థిని ముద్దల సుహిత షారోన్ జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు స్కూలు చైర్మన్ ఎం.శివ శంకర్ రెడ్డి, డైరెక్టర్ ఎం.శ్రీదేవి తెలిపారు. నవంబర్ 5, 6,7 తేదీలలో కర్నూల్ జిల్లా ఎమ్మిగనూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎస్ జీఎఫ్ అండర్-17 ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచినందున సుహిత షారోన్ జాతీయ జట్టుకు ఎంపికైందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ఉపాధ్యాయులు, పీఈటీ సునీల్, విద్యార్థిని తల్లిదండ్రులు జ్యోతిష్మయుడు ముద్దల సురేష్ బాబు, రేష్మ అభినందించారు.